అన్ని వర్గాల ప్రజలు సీఎం జగన్‌కు మద్దతు పలకాలి

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని

గుడ్లవల్లేరు: రానున్న ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలకాలని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. ఆదివారం ఆయన గాదేపూడి, ఉలవలపూడి, వడ్లమన్నాడులో ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఎన్నికలు అన్ని వర్గాల భవిష్యత్తును నిర్దేశించేందుకు జరుగుతున్నాయన్నారు. ప్రతి వర్గాన్ని మోసం చేసి ఎన్నికలు వచ్చేసరికి మరోసారి భ్రమలు కల్పించడానికి వస్తున్న కొందరు మోసగాళ్లను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాను గుర్తుపై తమ రెండు ఓట్లను వేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయనకు ప్రజానీకం పూలు, గజమాలలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యేకు మహిళలు అడుగడుగునా హారతులతో స్వాగతించారు. ప్రజలు అయన్ను స్వాగతిస్తూ బ్రహ్మరథం పట్టారు. ర్యాలీగా వచ్చిన ఆయనకు గ్రామస్తులు పూల వర్షం కురిపించారు. ఆలయాల్లో పూజలు చేసిన ఆయన చర్చిల్లో ప్రార్థనలు చేశారు. ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శాయన రవి, పార్టీ యువజనాధ్యక్షుడు గుదే రవి, వ్యవసాయ సలహా కమిటీ జిల్లా డైరెక్టర్ పెన్నేరు ప్రభాకర్, ఎంపీపీ కొడాలి సురేష్, వైస్ ఎంపీపీ పోలగాని రమాదేవి, వైఎస్సార్ సీపీ మండల బూత్ కన్వీనర్ కోటప్రోలు నాగు, కొండలమ్మ ఆలయ చైర్మన్ శేషం గోపి, ఎంపీటీసీ సభ్యులు ముక్కు సోమేశ్వరరావు, పెనుమాల పూర్ణ కవిత, రంగారావు, మండా దిలీప్‌కుమార్, సర్పంచ్ వీర్నాల లక్ష్మణరావు, నాయకులు మన్నెం చంటి, వేణు, అప్పిసీడ నాంచారయ్య పాల్గొన్నారు.


అభిమానుల భారీ ర్యాలీలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని


విజయం జగన్‌దే అని ఎమ్మెల్యే కొడాలి నానికి చెబుతున్న వృద్ధురాలు


ఎమ్మెల్యే కొడాలి నానికి పూలమాల వేసి ఆహ్వానిస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు

క్లుప్తంగా

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం



గుడివాడ టౌన్: స్థానిక వాసవిచౌక్‌లోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం శ్రీ రామ పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామి వారి పట్టాభిషేక కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ పాలకవర్గ అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు మాట్లాడుతూ శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అనంతరం 5వ రోజు స్వామి పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పట్టాభిషేకాన్ని తిలకించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో ఆలయ పాలక వర్గ సభ్యులు కె. నారాయణరావు, మురళీకృష్ణ, జగ్గారావు, ఐ.గోపాలకృష్ణ, భక్తులు దండమూడి సీతారామస్వామి, కేవీఎస్ సాంబశివరావు, తాడిపత్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే పేదలకు మేలు



పసమర్రు(పామర్రు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు మేలు జరిగిందని, సంక్షేమంతో పాటు, అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి అన్నారు. మండలంలోని పసమర్రు శివారు బోయినవారిపాలెంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి పని చేసే వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. కూటమి పేరుతో కొందరు మోసం చేయడానికి వస్తారని, వారితో జాగ్రత్తగా ఉండాలని ఆమె ఓటర్లకు సూచించారు. జగనన్నపై ఎన్ని కుట్రలు చేసినా అంతిమ విజయం వైఎస్సార్ సీపీదే అని పేర్కొన్నారు. అసెంబ్లీ అభ్యర్థిగా కైలే అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ అరేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల్లో నేడు కౌన్సెలింగ్

పామర్రు: గురుకుల విద్యాలయ సంస్థ ద్వారా నడుపుతున్న పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశ పరీక్ష రాసి ఫస్ట్‌ఫేజ్‌లో సీట్ల కోసం సోమవారం పామర్రు పాఠశాల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణారావుపాలెం, తిరువూరు, రుద్రవరం, పామర్రు గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హత పత్రాలతో విద్యార్థులు హాజరుకావాలని పేర్కొన్నారు,

నేడు ఎమ్మెల్యే కైలే ఎన్నికల ప్రచారం

తోట్లవల్లూరు: పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సోమవారం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మండలంలోని రొయ్యూరు, బొడ్డపాడు, చినపులిపాక, వల్లూరుపాలెంలో ఎమ్మెల్యే పర్యటిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమయ్యే ప్రచార కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు మండల పరిషత్ సమావేశం

పమిడిముక్కల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం జరుగుతుందని ఎంపీడీఓ సుభాని తెలిపారు. ఎంపీపీ కాసాని వేద సుప్రజ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగించిన అభివృద్ధి, సంక్షేమ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని యాకమూరు, గరికపర్రు, కుమ్మమూరు, కనకవల్లి గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యాకమూరు నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యేకు మహిళలు హారతులిచ్చి దీవెనలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి పాలన కావాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేసి ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌రావును, పామర్రు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అనిల్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, ఆర్డీసీ రాష్ట్ర డైరెక్టర్ మర్రెడ్డి శిల్పారెడ్డి, పంచాయతీరాజ్ జిల్లా కన్వీనర్ మోర్ల రామచంద్రరావు, మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, డీసీఎంఎస్ డైరెక్టర్ కిలారం శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు గాదె కనకదుర్గ, బొమ్మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పెనమకూరి నరసింహాశర్మ తదితరులు పాల్గొన్నారు.


యాకమూరులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పెత్తందారులను ఎదుర్కొందాం

ముదినేపల్లి రూరల్ : రానున్న ఎన్నికల్లో రాష్ట్రాన్ని హస్తగతం చేసుకుని అవినీతి కార్యక్రమాలకు పాల్పడేందుకు ప్రయత్నిస్తున్న పెత్తందారులను ఐక్య పోరాటంతో ఎదుర్కొందామని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కోడలు దూలం స్వాతి అన్నారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మతో కలిసి మండలంలోని గురజలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు అండగా ఉంటున్న సీఎం జగన్‌ను గద్దె దింపేందుకు పెత్తందారులంతా ఒక్కటై ఎన్నికల్లో పోటీకి సిద్ధపడ్డారన్నారు. వీరికి అధికారం అప్పగిస్తే పేదలకు ఎలాంటి ప్రయోజనం ఉండబోదన్నారు. ఎన్నికల్లో ఒంటరిగా పోరాడుతున్న జగనన్నకు ప్రతిఒక్కరం అండగా నిలిచి పెత్తందారులను తరిమికొడదామని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్ సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్న ముఖ్యమంత్రి కావడానికి సహకరించాలని కోరారు. పలువురు మహిళలు ఆప్యాయంగా నాయకులకు స్వాగతం పలికి పార్టీకి తమ మద్దతు తెలియజేశారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, సర్పంచ్ మంచాల సరస్వతి, నాయకులు మోట్రు ఏసుబాబు, కోమటి విష్ణువర్ధన్, పేర్ని పృథ్వీ పాల్గొన్నారు.


గురజలో ఎన్నికల ప్రచారం చేస్తున్న దూలం స్వాతి, నాయకులు

25 నుంచి ఉచిత కరాటే శిక్షణ

కైకలూరు: వేసవి సెలవుల నేపథ్యంలో ఈ నెల 25 నుంచి మే 30వ తేదీ వరకు స్థానిక సీతయ్య హోటల్ సమీప సప్తగిరి గ్రామీణ బ్యాంకుపైన జపాన్ షోటోఖన్ కరాటే స్కూల్లో ఉచిత కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు కరాటే బ్లాక్ బెల్ట్ (5వ డిగ్రీ) డాక్టరు ఉదయభాస్కర్ ఆదివారం తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు 99481 72513లో సంప్రదించాలని పేర్కొన్నారు. ఆడపిల్లలకు సెల్ఫ్ డిఫెన్స్‌పై ప్రత్యేక శిక్షణ అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

25న షాపుల లీజు వేలం

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం బావాజీ మఠానికి చెందిన షాపుల లీజు వేలం పాటలు ఈ నెల 25న నిర్వహిస్తామని ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. మఠానికి కోరుకొల్లు రోడ్డులో 11 షాపులున్నాయని పేర్కొన్నారు. వీటిని మూడేళ్లపాటు ప్రతి నెలా అద్దె చెల్లించే విధంగా లీజుకు ఇచ్చేందుకు మఠం కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఈ పాటలో పాల్గొనేవారు రూ.10వేలు ధరావత్తు చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కార్యాలయం పనిచేసే వేళల్లో సంప్రదించాలని కోరారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఉదయానికే ఆలయానికి చేరుకుకోవడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. స్వామిని దర్శించుకున్న అనంతరం నాగబంధాల వద్ద మహిళలు పూజలు చేశారు. గోకులంలోని గోవులకు మహిళలు పూజలు చేశారు. ఆలయ చైర్మన్ కొంథినాగరాజు, పాలకవర్గసభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలి



నందివాడ: మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని ఎంపీపీ పెయ్యల ఆదాం కోరారు. మండలంలోని నందివాడలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)కి మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు కందుల దుర్గాకుమారి, మండల నాయకులతో కలసి ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దేశిరెడ్డి రామ్మోహనరెడ్డి, సరేళ్ల రత్నకుమారి, గూడపాటి వెంకటేశ్వరరావు, రాజులపాటి చంద్రశేఖర్, కొండపల్లి చంద్రశేఖరరెడ్డి, కృష్ణారెడ్డి, కందుల నాగరాజు, తోట నాగరాజు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

గుడివాడ టౌన్: వేసవి తీవ్రత అధికంగా ఉండటంతో పట్టణంలోని బాటసారులకు మజ్జిగ పంపిణీ చేసినట్లు వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కొత్త మున్సిపల్ కార్యాలయం వద్ద పాదచారులకు ఈ మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కలపాల కిరణ్, యార్లగడ్డ మురళీకృష్ణ, బి.రవికుమార్ పాల్గొన్నారు.

వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పాదచారులకు మజ్జిగ పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు మెరుగుమాల శివరామకృష్ణ ఆదివారం తెలిపారు. స్థానిక ఏలూరు రోడ్ నాగవరప్పాడులో ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. గొరిపర్తి నాంచారయ్య వితరణతో ఈ పంపిణీ జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ఎల్ఈ వెంకటేశ్వరరావు, అర్జా ప్రసాదు, పి. సత్యనారాయణ, కె. రామారావు, కె. రామకృష్ణ, లింగం చిట్టిబాబు, బి. కుటుంబరావు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: కృష్ణా కరకట్టపై తోట్లవల్లూరు వద్ద ఆదివారం ఉచిత మజ్జిగ పంపిణీ జరిగింది. తోట్లవల్లూరు జెడ్పీ పాఠశాలలో 2000వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో గత మూడు వారాలుగా (ప్రతి ఆదివారం) ఉచిత మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. విజయవాడ-అవనిగడ్డ మధ్య కరకట్టపై ప్రయాణించే వాహనదారులతోపాటు లంక పొలాలకు వెళ్లే రైతులకు, కూలీలకు పూర్వ విద్యార్థులు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. పూర్వ విద్యార్థులు ముదులయ్య, గంగాధర్, మంగారావు, శ్రీను, ప్రసాద్, ఫణికుమార్ పాల్గొన్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


తోట్లవల్లూరు కరకట్టపై మజ్జిగ పంపిణీ చేస్తున్న యువకులు

జగనన్నతోనే సంక్షేమం సాధ్యం

పమిడిముక్కల: వైఎస్సార్ సీపీ అధినేత జగనన్నతోనే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం సాధ్యపడుతుందని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సోదరి కత్తుల అనిత అన్నారు. పమిడిముక్కల పంచాయతీ పరిధిలోని గుర్రాల్లంక, ఎన్టీఆర్ కాలనీల్లో ఆదివారం రాత్రి పార్టీ నాయకులతో కలిసి అనిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి ఓట్లు అభ్యర్థించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా వైఎస్సార్ సీపీని ఆదరించాలన్నారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి కైలే అనిల్‌కుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకటరమణకుమారి, ఎంపీటీసీ సభ్యుడు వంశీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, గౌడ, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్లు శొంఠి వెంకటేశ్వరరావు, కంభపు రాంబాబు, నాయకులు పాతూరి చంద్రపాల్, బొల్లా రాంబాబు, మైనేని కోటేశ్వరరావు, తిరుమలరావు, సునీల్, రమేష్, అక్కినేని సతీష్, కూరపాటి రాణి పాల్గొన్నారు.


గుర్రాల్లంకలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సోదరి అనిత

ఆర్ఎంపీలకు అండగా ఉంటాం

కైకలూరు: గ్రామీణ వైద్యులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) తనయుడు వినయ్ చెప్పారు. ఏలూరు రోడ్డులో విజయ్‌కుమార్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన మండల ఆర్ఎంపీల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కైకలూరు ఏరియా కమిటీ అధ్యక్షుడు విజయకుమార్ మాట్లాడుతూ సంఘ కమ్యూనిటీహాలు నిర్మాణానికి ఇటీవల ఎమ్మెల్యే స్థలం కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఆర్ఎంపీలు అండగా నిలవాలని వినయ్ కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ సెక్రటరీ లంకపల్లి రవి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.ఉమామహేశ్వరరావు, కమిటీ సభ్యులు బృందావనం శేషుబాబు, గౌరవాధ్యక్షుడు కేసిరెడ్డి జనార్దన్‌రావు, వి.గణేష్, అశోక్, లాజర్, జి.సూర్యప్రకాష్ జాయింట్ సెక్రటరీ, బాలరామమూర్తి, ఘంటసాల అనిల్‌కుమార్, వీరాస్వామి, సువేకర్ పాల్గొన్నారు.


ఆర్ఎంపీ వైద్యులతో ఎమ్మెల్యే డీఎన్నార్ కుమారుడు వినయ్

కొండలమ్మ సన్నిధిలో భక్తుల సందడి

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయంలోని క్యూలో భక్తులు ఆదివారం అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు. క్యూలో వచ్చే భక్తులకు మజ్జిగను అందించారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



కలిదిండి: వేంకటేశ్వర స్వామి దివ్యమైన ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికీ కలగాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోరారు. కోరుకొల్లులో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ దంపతులు పాల్గొన్ని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు దంపతులు, ఉపసర్పంచ్ చన్నంశెట్టి నాగరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు అంకెం నరసయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు చన్నంశెట్టి సోమేశ్వరరావు, త్రిసభ్య కమిటీ సభ్యులు తలారి వీరుళ్లు, వలవల ప్రసాద్, అప్పన్న చిన్న, చన్నంశెట్టి మాతారావు పాల్గొన్నారు.

గీతామందిరంలో ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం

అవనిగడ్డ: స్థానిక గీతామందిరంలో ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్టా కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆగమ పండితులు నల్లూరు దాశరథి శ్రీనివాస దీక్షితులు బ్రహ్మత్వంలో పలువురు అర్చకుల వేద మంత్రాల నడుమ ఉదయం 11 గంటలకు విమాన శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం జరిగింది.

ఈ సందర్భంగా వేలాది మంది భక్తుల శ్రీమన్నారాయణ నామస్మరణ, స్వామివారికి జయ జయ ధ్వానాలతో ఆ ప్రాంతం మార్మోగింది. ఎంపీపీ తుంగల సుమతీదేవి, లండన్ నుంచి వచ్చిన ధనుంజయరావు, బీజేపీ నాయకురాలు భోగాది రమాదేవి హోమ కార్యక్రమం నిర్వహించారు. అవనిగడ్డ మండలంతో పాటు మోపిదేవి, కోడూరు, నాగాయలంక మండలాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి ఉత్సవాన్ని కనుల పండువగా తిలకించారు. అనంతరం 15వేల మంది భక్తులకు అన్న సమారాధన చేశారు. కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త యర్రంశెట్టి హరిబాబు, లక్ష్మీనారాయణస్వామి ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు పర్యవేక్షించారు.


గీతామందిరంలో ధ్వజస్తంభ ప్రతిష్ట

కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం భార్యను వేధిస్తూ, ఆమెపై దాడి చేసిన భర్తపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు మురళీనగర్‌లో నివశిస్తున్న షేక్ తస్లీమాబేగంకు 10 ఏళ్ల క్రితం కట్నకానుకలు ఇచ్చి షేక్ షాబాజితో వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త ఫ్లెక్సీల ప్రింటింగ్ షాపులో పని చేస్తాడు. కాగా భర్త దురలవాట్లకు బానిసగా మారి భార్యను అదనపు కట్నం తీసుకురమ్మని వేధించసాగాడు. తస్లీమాబేగంపై దాడి చేసి చంపుతానని బెదిరించసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఘనంగా శ్రీవారి కల్యాణం

మచిలీపట్నం టౌన్: స్థానిక బచ్చుపేటలోని శ్రీ భూ పరివార సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్య తిరుక్కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి వారి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ముత్తేవి రవికాంత్, భార్గవి దంపతులు పీటలపై కూర్చోగా పురోహితులు జోస్యుల రాంప్రసాద్, ముత్తేవి శ్రీనివాస శశికాంత్, కాండూరి లక్ష్మీనరసింహాచార్యులు కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. ఈ నెల 22వ తేదీ సోమవారం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరగనుందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.ఎస్.చక్రధరరావు తెలిపారు.

ఘనంగా సీతారాముల విగ్రహ పునఃప్రతిష్ట



గూడూరు: ఐదుగుళ్లపల్లిలోని రామాలయంలో దేవతామూర్తుల విగ్రహ పునఃప్రతిష్ట ఆదివారం ఘనంగా నిర్వహించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఆలయాన్ని గ్రామస్తులు, దాతల సాయంతో అభివృద్ధి చేశారు. దీనిలో భాగంగా శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి దేవతామూర్తులను రూ.70 వేలతో గ్రామానికి చెందిన దాత దారపురెడ్డి కోటేశ్వరరావు, భోగి లక్ష్మి దంపతులు సమకూర్చారు. ఆదివారం దేవతామూర్తుల విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమం వేదపండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కటకం జానకి రామయ్య, పిచ్చుక తాతారావు, ఊట్ల ఈశ్వరరావు, గుడివాడ సిద్ధయ్య, రాజులపాటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

దేవతా విగ్రహాలకు గ్రామోత్సవం



బంటుమిల్లి: అర్తమూరులో శ్రీ పార్వతి సమేత రామేశ్వరస్వామి ఆలయంలో పలు దేవత విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా ఆలయంలో మహామండపంతోపాటు తదితర పునఃనిర్మాణ పనులు చేశారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రోక్షణ తర్వాత పలు దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ట చేస్తున్నారు. ఆదివారం శ్రీ గణపతి, శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ అర్ధనారీశ్వరం, శ్రీ మేధాదక్షిణామూర్తి, శ్రీ వేంకటేశ్వర, శ్రీ బ్రహ్మ, శ్రీ కల్యాణసుందరమూర్తి, శ్రీ విష్ణుదుర్గ, శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి, నంది విగ్రహాలు తదితరాలను ట్రాక్టరుపై ఉంచి మేళ, తాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.